సాక్షి
కుమురం భీం
సోమవారం । 18 । నవంబర్ । 2024



భయం గుప్పిట్లో గ్రామాలు
ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్, నార్నూర్ మండలాల్లో పెద్దపులి కలకలం సృష్టించింది. జోడే ఘాట్ అడవుల వైపు పులి వెళ్తుందని అధికారులు తెలిపారు. 8లో ▸



జిల్లాల్లో పారామెడికల్ కోర్సులు
విద్యార్థులకు పారామెడికల్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఏడాది నుంచే డీఎంఎస్టీ, డీఈసీజీ కోర్సులు ప్రారంభం కానున్నాయి. 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.3 /14.5
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. మంచు కురుస్తుంది. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

సమగ్ర సర్వే పకడ్బందీగా చేపట్టాలి


సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కాగజ్‌నగర్‌రూరల్: జిల్లాలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. పట్టణంలోని ఎస్‌జీఓఎస్ కాలనీలో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను ఆదివారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌ల్లోని ప్రతీ ఇంటిని సందర్శించాలన్నారు. కుటుంబ సభ్యుల వివరాలను నిర్ణీత నమూనాలో పొందుపర్చాలని ఆదేశించారు.

విద్యుత్ ఇంజినీర్ల కార్యవర్గం
మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ ఇంజినీర్ల మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కార్యవర్గాన్ని మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం ఎన్నుకున్నారు. ప్రిసైడింగ్ అధికారి బానోత్ రాజన్న ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్రాంచ్ కార్యదర్శిగా జె.విలాస్, సహాయ కార్యదర్శిగా టి.తిరుపతి, కోశాధికారిగా రాంచదర్, మంచిర్యాల జిల్లా కార్యదర్శిగా శరత్‌కుమార్, ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శిగా ఎండీ.ఇమ్రాన్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గసభ్యులు ఇంజినీర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సభ్యులకు బి.రాజన్న, అసిస్టెంట్ ఇంజినీర్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి కృష్ణ, సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

నేటి ప్రజావాణి రద్దు
ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్‌- 3 పరీక్షలు, సమగ్ర కుటుంబ సర్వే నేపథ్యంలో అధికారులు అందుబాటులో లేకపోవడంతో కార్యక్రమం రద్దు చేశామని పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయం గమనించాలని సూచించారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు
ఆసిఫాబాద్‌అర్బన్: గ్రూపు- 3 పరీక్షలు నిర్వహించే విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్ 3 కొనసాగనున్న నేపథ్యంలో సెలవు ప్రకటించామన్నారు.

మహా ఓటింగ్‌కు సై!


తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని పరంధోళి గ్రామం

- మహారాష్ట్రలో ఈ నెల 20న అసెంబ్లీ ఎన్నికలు
- నేటితో ప్రచారానికి తెర
- 'రాజూరా'లో ఓటు వేయనున్న సరిహద్దు గ్రామాల ప్రజలు
- నాలుగు పోలింగ్ కేంద్రాల్లో 3,597 మంది ఓటర్లు
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

కెరమెరి(ఆసిఫాబాద్): మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 20న ఎన్నికలు జరగనున్నాయి. సరిహద్దులోని చంద్రాపూర్ జిల్లా రాజూరా నియోజకవర్గ ఎన్నికల్లో కెరమెరి మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. గతేడాది నవంబర్ 30న జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలో ఓటుహక్కు వినియోగించుకోగా.. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంతోపాటు మహారాష్ట్రలో


ఇరురాష్ట్రాల ఓటరుకార్డులు చూపుతున్న ప్రజలు

ఎంపీ స్థానానికి జరిగిన ఎన్నికల్లోనూ ఓటు వేశారు. ఇప్పుడు నాలుగోసారి ఓటు వేయనున్నారు.

15 గ్రామాల్లో ఓటర్లు
తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం 15 గ్రామాల్లోని ప్రజలకు రెండు రాష్ట్రాల్లో ఓటుహక్కు ఉంది. చంద్రాపూర్ జిల్లా రాజూరా అసెంబ్లీ స్థానానికి ఈ నెల 20న పోలింగ్ నిర్వహిస్తుండగా.. 14 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అయితే వారిలో సుభాష్ బావు ధోటే(కాంగ్రెస్), దేవ్‌రావు భోంగ్లే(బీజేపీ), వామన్‌రావు చటప్(సేత్‌కారి సంఘటన్), గజానంద్ గోద్రు జుగ్నాకే(గోండ్వానా గణతంత్ర పార్టీ) మధ్య బలమైన పోటీ ఉంటుందని భావిస్తున్నారు. పరంధోళి, నోకేవాడ, బోలాపటార్, అంతాపూర్ పోలింగ్ స్టేషన్ల పరిధిలోని సరిహద్దు గ్రామాల్లో సుమారు 3,597 మంది ఓటర్లు ఉన్నారు. పరంధోళి పోలింగ్ కేంద్రం పరిధిలో పరంధోళి, తాండ, కోటా, శంకర్‌లొద్ది, లేండిజాల, ముకదంగూడ గ్రామాలు, నోకేవాడ పరిధిలో మహరాజ్‌గూడ, భోలాపటార్ పరిధిలో భోలాపటార్, గౌరి, లేండిగూడ, అంతాపూర్ పోలింగ్ కేంద్రం పరిధిలో నారాయణగూడ, ఏసాపూర్, పద్మావతి, ఇంద్రానగర్, అంతాపూర్ గ్రామాలు ఉన్నాయి.

పోలింగ్ కేంద్రం	జనాభా	ఓటర్లు
పరంధోళి	2,470	1,367
నోకేవాడ	700	370
భోలాపటార్	1,102	882
అంతాపూర్	1,902	978
మొత్తం	6,174	3,597

సమస్యలతో సహవాసం
రెండు రాష్ట్రాల పాలనలో కొనసాగుతున్న ఈ గ్రామాల్లోని ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలతోపాటు ఇతర ప్రజాప్రతినిధులను ఇరురాష్ట్రాల నుంచి ఎన్నుకుంటారు. ప్రభుత్వాలు కూడా ఇక్కడి ప్రజలకు ఇరు రాష్ట్రాల నుంచి సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు రేషన్‌కార్డులు మంజూరు చేశాయి. తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంలో భాగంగా తాగునీటి సదుపాయం కల్పించగా.. మహారాష్ట్ర ప్రభుత్వం రూ.50కోట్లకు వరకు వెచ్చించి బీటీ రోడ్లు వేయించింది. 40 ఏళ్లుగా పోరాడుతున్నా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. అయితే సాగు భూములకు పట్టాలు లేకపోవడం రైతులకు ఇబ్బందిగా మారింది. దాదాపు 80శాతం మందికి పట్టాలు లేవు. గతంలో మహారాష్ట్ర ప్రభుత్వం అటవీ, రెవెన్యూ శాఖలతో ఉమ్మడి సర్వే నిర్వహించింది. నెలలు గడుస్తున్నా పురోగతి లేదు. గ్రామాలు ఏ రాష్ట్రం పరిధిలోకి వస్తాయనే దానిపై తెలంగాణ, మహారాష్ట్ర మధ్య కొనసాగుతున్న వివాదంపై 1989 వామన్‌రావు చటప్ సుప్రీం కోర్టుకు వెళ్లారు. ప్రస్తుతం ఆయన సేత్‌కారి సంఘటన్ పార్టీ నుంచి బరిలో నిలిచారు. నెట్‌వర్క్ సిగ్నల్ సమస్యను పరిష్కరించేందుకు టవర్లు ఏర్పాటు చేయడంతోపాటు ఉమ్రి నుంచి జంగుబాయి అమ్మవారి క్షేత్రం వరకు రోడ్డు వేయాలని, పట్టాలు మంజూరు చేయాలని కోరుతున్నారు.

హామీలు నిలబెట్టుకోవాలి



రెండు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకుంటున్నాం. పోటీలో నిలిచే అభ్యర్థులు సమస్యలు పరిష్కరిస్తామని చెబుతున్నా గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదు. మహారాష్ట్ర ప్రభుత్వం సాగు భూములు సర్వే చేయగా.. ఎన్నికల తర్వాత పట్టాలిస్తామని అభ్యర్థులు హామీలు ఇస్తున్నారు. హామీలు నిలబెట్టుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి.
– కాంబ్లె లక్ష్మణ్, పరంధోళి

ఏజెన్సీపై చలి పంజా


తిర్యాణిలో చలిమంట కాగుతున్న ఆదివాసీలు

- 10 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు
- తిర్యాణిలో 12.1 డిగ్రీలుగా నమోదు
- ఇబ్బందులు పడుతున్న గిరిజనులు

తిర్యాణి(ఆసిఫాబాద్): జిల్లాలోని ఏజెన్సీ మండలాలపై చలి పంజా విసురుతోంది. రెండు రోజులుగా మళ్లీ కనిష్ట ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయిలో పడిపోతున్నాయి. చుట్టూ దట్టమైన అడవులు ఉండటంతో గిరిజన గూడేల్లో ప్రజలు వణుకుతున్నారు. ఉదయం, సాయంత్రం మంచు ప్రభావంతో బయటికి వచ్చేందుకు జంకుతున్నారు. ఉదయం 8 గంటలు దాటినా చలితీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. మళ్లీ సాయంత్రం నాలుగు, ఐదు గంటల నుంచే ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గిరిజన ప్రాంతాల్లో రాత్రి ఎనిమిది గంటల నుంచే ఇళ్లకు తలుపులు వేసుకుంటున్నారు. చలిమంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. స్వెటర్లు, మంకీ క్యాపులు ధరిస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత తీవ్రస్థాయిలో ఉష్ణోగ్రతలు పడిపోయే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

పడిపోతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు
ఏజెన్సీ మండలాలు చలికి వణుకుతున్నాయి. రెండు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఆదివారం రాష్ట్రంలోనే అత్యల్పంగా ఏజెన్సీ మండలమైన తిర్యాణిలో 12.1 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. వీటితో పాటు సిర్పూర్(యూ)లో 12.3, వాంకిడిలో 13.1, కెరమెరిలో 13.3, ఆసిఫాబాద్‌లో 13.4, కాగజ్‌నగర్‌లో 13.9, రెబ్బెన, జైనూర్‌లో 14.3 కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఈ నెల 16న సిర్పూర్(యూ)లో 12.7, తిర్యాణిలో 14.4, వాంకిడిలో 14.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

గ్రంథాలయంలో కవి సమ్మేళనం
ఆసిఫాబాద్‌అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నాలుగోరోజు జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పరీక్షల విభాగం సహాయ కమిషనర్ ఉదయ్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా కవులు తమ కవితలు చదివి వినిపించారు. గ్రంథాలయ సిబ్బంది కవులను ఘనంగా సత్కరించారు. కవులు మాడుగుల నారాయణమూర్తి, ధర్మపురి వెంకటేశ్వర్లు, రాధాకృష్ణచారి, సత్యనారాయణ, శ్రీనివాస్, ఇసాక్, శ్రీదేవి, రేవతి, సవిత, పెంటయ్య, శ్రీలత, సాకేత్, వివేక్, రాజయ్య, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కవిని సన్మానిస్తున్న సిబ్బంది

దరఖాస్తుల ఆహ్వానం
కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని కేజీబీవీలో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో ప్రభాకర్ తెలిపారు. నైట్ వాచ్‌ఉమెన్, డే వాచ్ ఉమెన్, అసిస్టెంట్ కుక్, స్వీపర్ ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయని, 18 – 45 ఏళ్ల వయస్సు ఉన్న స్థానిక మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్వీపర్, అసిస్టెంట్ కుక్ పోస్టుకు ఏడో తరగతి, డే/నైట్ వాచ్ ఉమెన్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 23 సాయంత్రం 4 గంటలలోగా డీఆర్‌సీ భవనంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రశాంతంగా గ్రూప్‌- 3 పరీక్షలు


కాగజ్‌నగర్‌లోని పరీక్ష కేంద్రంలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

- ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో కేంద్రాల ఏర్పాటు
- పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీ
- నిమిషం నిబంధనతో పరీక్షకు పలువురు దూరం

ఆసిఫాబాద్‌రూరల్/కాగజ్‌నగర్‌రూరల్: జిల్లాలో గ్రూపు- 3 మొదటిరెండు పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. మొదటి పేపర్ ఉదయం 10 గంటలకు ఉండగా.. 8.30 నుంచి బయోమెట్రిక్ తీసుకుని లోపలికి వెళ్లేందుకు అనుమతించారు. ఆసిఫాబాద్ పట్టణంలో 9, కాగజ్‌నగర్ పట్టణంలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం నిర్వహించిన పేపర్‌- 1కు 4,471 మంది అభ్యర్థులకు 2,794 మంది హాజరు కాగా.. 1677 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరిగిన పేపర్ -2కు 2,779 మంది హాజరు కాగా 1,692 మంది గైర్హాజరయ్యారు. 62 శాతం మంది హాజరయ్యారని అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం పేపర్‌- 3 నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

పరీక్ష కేంద్రాలు పరిశీలన
జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ, పీటీజీ గురుకుల పాఠశాల, కాగజ్‌నగర్‌లోని సెయింట్ మేరీ పాఠశాల, వివేకానంద డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పరిశీలించారు. అభ్యర్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓఎంఆర్ షీట్లను బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూంకు తరలిస్తామని తెలిపారు. సోమవారం నిర్వహించే మూడో పేపర్ కోసం ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆయన వెంట కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అధికారులు ఉన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌తోపాటు పలు కేంద్రాలను ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సందర్శించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం స్ట్రాంగ్ రూంకు ఓఎంఆర్ షీట్ల తరలింపుపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. డీఎస్పీ రామానుజం ఆధ్వర్యంలో గ్రూపు- 3 పరీక్షలు రాసేందుకు వచ్చే అభ్యర్థులకు కాగజ్‌నగర్ బస్టాండ్ నుంచి కేంద్రాల వరకు ఉచిత వాహన సౌకర్యం కల్పించారు.


బందోబస్తు పర్యవేక్షిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు


ఉచిత వాహన కేంద్రం వద్ద డీఎస్పీ రామానుజం

నిమిషం నిబంధనతో వెనక్కి..
గ్రూపు- 3 పరీక్షకు ప్రభుత్వం నిమిషం నిబంధనను అమలు చేయడంతో జిల్లాలో ఎనిమిది మంది అభ్యర్థులు పరీక్ష రాయకుండానే వెనుదిరిగారు. ఆసిఫాబాద్ పట్టణంలోని పీటీజీ గురుకుల పాఠశాలలోని కేంద్రానికి ఇద్దరు, సెయింట్ మేరీ పాఠశాలకు ఇద్దరు, కాగజ్‌నగర్‌లోని వసుంధర కళాశాలకు ఒకరు, జవహర్ నవోదయ విద్యాలయంలోని కేంద్రానికి ముగ్గురు ఆలస్యంగా వచ్చారు. అభ్యర్థులు అధికారులను బతిమాలినా లోపలికి పంపించలేదు.


ఆసిఫాబాద్‌లో తనిఖీ చేస్తున్న సిబ్బంది


కాగజ్‌నగర్‌లో నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు


గేటు తీయాలని ప్రాధేయపడుతున్న అభ్యర్థి

వీడని భయం.. చదువుకు దూరం

- వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో పెరగని హాజరు
- ప్రస్తుతం ఉన్నది 136 మంది మాత్రమే..
- ప్రత్యేక తరగతులకూ హాజరుకాని 'పది' విద్యార్థినులు
- రెగ్యులర్ హెచ్‌ఎం, వార్డెన్ లేక ఇబ్బందులు


వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలోని 60 మందికి పైగా విద్యార్థినులు అస్వస్థతకు గురై 18 రోజులు గడిచినా పాఠశాల గాడిన పడటం లేదు. కలెక్టర్ ప్రత్యేక కమిటీని నియమించి విచారణ అనంతరం హెచ్‌ఎం శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు. మరో నలుగురు నాన్ టీచింగ్ సిబ్బందిపైనా బదిలీ వేటు వేశారు. రెండు, మూడు రోజుల వ్యవధిలోనే విద్యార్థులు అనారోగ్యం బారిన పడటం, కొందరు తీవ్ర అస్వస్థతతో నిమ్స్‌లో చికిత్స పొందడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. అప్పటి నుంచి ఒక్కొక్కరుగా వచ్చి తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. ఘటన తర్వాత 571 మందికి 95 మంది బాలికలు మాత్రమే మిగిలారు. హాస్టల్ నుంచి ఇళ్లకు వెళ్లిన పిల్లలను తిరిగి పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. ప్రస్తుతం 136 మంది విద్యార్థినులు మాత్రమే పాఠశాలలో ఉన్నారు.

నో హెచ్‌ఎం, నో వార్డెన్..
వసతిగృహం నిర్వహణలో హెచ్‌ఎం, వార్డెన్ పాత్ర కీలకం. హెచ్‌ఎంతోపాటు వార్డెన్‌గా విధులు నిర్వహించిన శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసిన అనంతరం.. ఆ పోస్టుల్లో ఎవ్వరినీ నియమించలేదు. విద్యార్థినుల అస్వస్థతకు గురైన పదిరోజుల తర్వాత అధికార యంత్రాంగం విచారణ చేపట్టింది. రెండు రోజులపాటు జరిగిన విచారణ అనంతరం విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారని హెచ్‌ఎంను సస్పెండ్ చేస్తూ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ఆ తర్వాత హెచ్‌ఎంను కానీ వార్డెన్‌ను కానీ నియమించలేదు. సీనియర్ ఉపాధ్యాయుడికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించగా.. సదరు ఉపాధ్యాయుడు నిరాకరించినట్లు తెలుస్తోంది. అలాగే వార్డెన్ ఇన్‌చార్జి బాధ్యతలు కూడా మరో టీచర్‌కు అప్పగించగా ఆ టీచర్ కూడా నిరాకరించినట్లు సమాచారం. ప్రస్తుతం ఎప్పటికప్పుడు కూరగాయలు తీసుకొచ్చి విద్యార్థినులకు వంట చేస్తున్నారు. జీసీసీ నుంచి సరుకులు రవాణా నిలిచిపోయింది. ఉన్న సరుకులను స్టోర్ రూంలోనే తాళం వేసి ఉంచారు.

తిరిగిరాని విద్యార్థినులు
వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 571 అడ్మిషన్లు పొందిన విద్యార్థినుల్లో నిత్యం సుమారుగా 540 మంది వరకు వసతిగృహంలో ఉండేవారు. ప్రస్తుతం పాఠశాలలో 136 మంది మాత్రమే ఉన్నారు. 60 మందికి పైగా ఆస్పత్రుల పాలు కాగా.. ఆరోగ్యం విషమించిన జ్యోతి, మహాలక్ష్మి, శైలజను హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స అందించారు. ఇద్దరు కోలుకుని ఇంటికి రాగా మరో విద్యార్థిని శైలజ పరిస్థితి ఇప్పటికీ కుదుటపడలేదు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను తిరిగి పాఠశాలకు పంపేందుకు భయపడుతున్నారు. అధికారులు సైతం వెంటనే చర్యలు తీసుకోకపోవడం, రెగ్యులర్ హెచ్‌ఎం, వార్డెన్‌ను నియమించకపోవడం తదితర కారణాలతో కూడా బాలికలు తిరిగి రావడం లేదని తెలుస్తోంది.

'పది' తరగతులపై సందిగ్ధం..
ఇళ్లకు వెళ్లిన విద్యార్థులు మూడు వారాలు గడిచినా తిరిగి పాఠశాలకు రాకపోవడంతో నష్టపోతున్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థినులు సైతం చాలా మంది ఇంటి వద్దే ఉన్నారు. ఆశ్రమ పాఠశాలలో పదో తరగతిలో 56 మంది చదువుకుంటున్నారు. వారిలో ప్రస్తుతం 38 మంది మాత్రమే పాఠశాలలో ఉన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. 18 మంది ఇళ్లలోనే ఉండటంతో ప్రత్యేక తరగతులు, రోజువారీగా నిర్వహించే పరీక్షలకు హాజరుకావడం లేదు.

సీనియర్ టీచర్లకు బాధ్యతలు
వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసిన అనంతరం హెచ్‌ఎం, వార్డెన్ బాధ్యతను అక్కడే పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులకు అప్పగించాం. అస్వస్థతకు గురైన విద్యార్థినులు అందరూ కోలుకున్నారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న శైలజ కోలుకోవడానికి కొంత సమయం పడుతుంది. తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బాలికలు తిరిగి పాఠశాలకు వచ్చేలా ప్రతిరోజూ ఫోన్‌లో మాట్లాడుతున్నాం. ఎస్‌సీఆర్పీలు ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు.
– రమాదేవి, డీటీడీవో

బాక్సింగ్‌లో గిరిజన విద్యార్థి ప్రతిభ
కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని అనార్‌పల్లి గ్రామానికి చెందిన బాదావత్ శ్రీకర్‌నాయక్ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటాడు. బాదావత్ ప్రకాశ్, క్రిష్ణవేణి దంపతుల కుమారుడు శ్రీకర్ నాయక్ ప్రస్తుతం కాగజ్‌నగర్‌లోని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. పీఈటీ వనిత బాక్సింగ్‌లో శిక్షణ అందిస్తోంది. ఈ నెల 2 నుంచి 10 వరకు నిజామాబాద్ జిల్లాలోని గాంధారి ఏకలవ్య పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు కాగజ్‌నగర్ ఏకలవ్య పాఠశాల నుంచి 15 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రాష్ట్రస్థాయిలో రెండోస్థానంలో నిలిచిన శ్రీకర్ సిల్వర్ మెడల్ సాధించాడు. ఛతీస్‌గఢ్ రాష్ట్రంలో ఈ నెలలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు.


శ్రీకర్ నాయక్

క్లుప్తంగా

పోడుకోసం చెట్లు నరికివేత


లింగాపూర్ బీట్‌లో చెట్లు నరికివేసిన దృశ్యం

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ అటవీ బీట్ పరిధిలో 380 కంపార్ట్‌మెంట్‌లో పోడు వ్యవసాయం కోసం కొందరు వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున సుమారు ఎకరం స్థలంలో సుమారు 70 చెట్లకు పైగా నరికివేశారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకునే లోపు వారంతా పారిపోయారు. ఈ విషయమై తాళ్లపేట ఎఫ్ఆర్వో సుష్మరావును వివరణ కోరగా అటవీ భూమిలో చెట్లు తొలగించిన విషయం వాస్తవమే, చెట్లను తొలగించినవారు దమ్మన్నపేటకు చెందిన వారిగా గుర్తించామన్నారు. వారందరికీ కౌన్సెలింగ్ ఇచ్చి అటవీ భూమిలో చెట్లను తొలగించొద్దని అవగాహన కల్పిస్తామని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


పట్టుకున్న ట్రాక్టర్లు

జన్నారం: జన్నారం అటవీ రేంజ్ ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. పక్కా సమాచారంతోనే సిబ్బందితో నిఘా పెట్టగా ఇసుకతో మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. సెక్షన్ అధికారి రవి, బీట్ అధికారి ముజీబొద్దీన్ ఉన్నారు.

దాతలు సాయం కోసం ఎదురుచూపు


మంచంపట్టిన కిరణ్‌తో తల్లి అమృత

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన నిరుపేద యువకుడు అమంద కిరణ్ అనారోగ్యంతో మంచం పట్టాడు. కడుపు ఉబ్బసం, కాలేయం చెడిపోయి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తండ్రి శ్రీనివాస్ గత కొన్నేళ్ల క్రితం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి అమృత వంట పనులు చేస్తోంది. అప్పులు చేసి కుమారుడికి వైద్య చికిత్స అందిస్తోంది. అయినా కిరణ్ ఆరోగ్యం మెరుగుపడడం లేదు. ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వ లేక దయనీయ పరిస్థితిలో దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. దాతలు ఫోన్ పే, గూగుల్ పే నంబర్ 9550227132 నంబర్‌లో నగదు పంపించాలని కోరింది.

పుస్తక పఠనం-పునర్వైభవంపై సెమినార్

మంచిర్యాలఅర్బన్: గ్రంథాలయ 57వ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయాలు-పుస్తక పఠనం - పునర్వైభవం అనే అంశంపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ పుస్తక పఠనం వికాసాన్ని, విజ్ఞానాన్ని అందిస్తుందన్నారు. పఠనం ద్వారా వివిధ భాషలపై పట్టు పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కవులు, స్థానికులు శ్రీనివాస్, భూపతి సంతోష్, మల్లేశం, లైబ్రేరియన్లు మురళి, గోపి, రమేశ్ పాల్గొన్నారు.

జిల్లాల్లో పారామెడికల్ కోర్సులు

- నిర్మల్ వైద్య కళాశాలలో డీఎంఎస్టీ, డీఈసీజీ
- మంచిర్యాలలో డీఎంఎల్‌టీ, డీఎంఎస్టీ
- ఆయా కోర్సుల్లో మొత్తం 120 సీట్లు
- 20 వరకు దరఖాస్తు గడువు



నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాల

నిర్మల్‌చైన్‌గేట్/మంచిర్యాలటౌన్: అనేక వ్యాధులకు చికిత్స అందించడంలో వైద్యుల పాత్ర ఎంత కీలకమో వారికి తెర వెనుక సహకారం అందించడంలో పారా మెడికల్ సిబ్బంది పాత్ర కూడా అంతే కీలకం. అంత ప్రాముఖ్యత కలిగిన పారామెడికల్ కోర్సులను అభ్యసించడానికి జిల్లా విద్యార్థులకు అవకాశాలు అందివచ్చాయి. నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండు కోర్సుల్లో ప్రవేశాలకు పారా మెడికల్ బోర్డు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది నుంచే డీఎంఎస్టీ, డీఈసీజీ కోర్సులు ప్రారంభం కానున్నాయి.

మెరుగవనున్న వైద్య సేవలు

పారామెడికల్ కోర్సులు ప్రారంభమైతే జిల్లా జనరల్ ఆస్పత్రిలో సేవలు మరింత మెరుగయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థులు జిల్లా జనరల్ ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంటుంది. అలాగే పారామెడికల్ కోర్సుల్లో చేరే వారు సైతం జిల్లా ఆస్పత్రిలో ప్రాక్టికల్స్‌కు వెళ్లడంతోపాటు మధ్యాహ్న సమయంలో వైద్య కళాశాలలో తరగతులకు హాజరుకావాల్సి ఉంటుంది.

ఇంటర్ పాసైన వాళ్లు అర్హులు

వైద్య సేవలు అందించేందుకు వైద్యులతోపాటు పారామెడికల్ సిబ్బందికి కూడా ప్రభుత్వం అవసరమైన వైద్య కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. పారామెడికల్‌లో మొత్తం 21 కోర్సులు ఉండగా నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ (డీఎంఎస్టీ), డిప్లొమా ఇన్ ఈసీజీ టెక్నీషియన్ (డీఈసీజీ) కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఒక్కో కోర్సులో 30 సీట్ల చొప్పున కేటాయించారు. ఈ కోర్సుల కాలవ్యవధి రెండేళ్లు. ఇంటర్ బైపీసీ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులు. అయితే బైపీసీ విద్యార్థులు లేకపోతే ఇంటర్‌లో ఇతర కోర్సులు చేసిన వారికి సైతం అవకాశం కల్పించనున్నారు. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు ఫారం, ఇతర వివరాలకు www. tgpmb. telangana. gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

మంచిర్యాలలో..

మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల 2022లో ఏర్పడగా, ఇటీవలే మూడో ఏడాదిలోకి అడుగుపెట్టింది. 100 ఎంబీబీఎస్ సీట్లతో ప్రస్తుతం 300ల మంది వైద్య విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పారా మెడికల్‌లో 21 కోర్సులు ఉన్నాయి. డీఎంఎల్టీ, డీఎంఎస్‌టీ కోర్సులు ప్రారంభించింది. డీఎంఎల్టీ (డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్)లో 30 సీట్లు, డీఎంఎస్‌టీ (డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్)లో 30 సీట్లతో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ కోర్సుల కాలవ్యవధి రెండేళ్లు. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు ఫారం, వివరాలకు www. tgpmb. telangana. gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించడం, 040–24653519 నంబరులో సంప్రదించాలి.


మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల

దరఖాస్తు చేసుకోవాలి



నిర్మల్ వైద్య కళాశాలలో డీఎంఎస్టీ, డీఈసీజీ కోర్సులు ప్రారంభించాం. ఈ రెండు కోర్సులకు కలిపి 60 సీట్లు కేటాయించాం. ఈ కోర్సులు చేసినవారికి మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలుంటాయి. ఇంటర్ పూర్తి చేసిన అర్హులైన విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి.

– శ్రీనివాస్, ప్రిన్సిపాల్, మెడికల్ కళాశాల, నిర్మల్

గూడెంలో కార్తిక పూజలు


సత్యనారాయణ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో కార్తిక పూజలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం భక్తులు తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. సుమారు 425 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు

రెండు చేతులు లేకపోయినా...

- గ్రూపు–3 పరీక్షలకు హాజరైన జాకీర్‌పాషా

కాగజ్‌నగర్‌రూరల్: అంగవైకల్యం చదువుకు ఏమాత్రం అడ్డుకాదని నిరూపిస్తున్నాడు కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌లోని చారిగాం ఏరియాకు చెందిన జాకీర్‌పాషా. పుట్టుకతోనే రెండు చేతులు లేకపోయినప్పటికీ పట్టుదలతో ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధించాలనే తపనతో నిరంతరం తన ప్రయత్నాలు కొనసాగిస్తున్నాడు. ఆదివారం నిర్వహించిన గ్రూపు–3 పరీక్షకు ఉత్సాహంగా హాజరై పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలోని పరీక్షా కేంద్రంలో కాలితో పరీక్ష రాశాడు. గతంలో కూడా ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో కూడా తన బాధ్యతగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నాడు. అంతే కాకుండా హరితహారం కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొని కాలితో మొక్కలు నాటడం, రాయడం, పెయింటింగ్ వేయడంలాంటి కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు.


పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న జాకీర్‌పాషా

జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: జీవితంపై విరక్తితో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినిత తెలిపారు. ఆమె కథనం ప్రకారం..జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన అనుదీప్(30) ప్రైవేటు డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గతంలో ఓ యువతితో ప్రేమ వ్యవహారంలో గొడవలు జరుగగా, రైల్వేట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటనలో స్వల్పగాయాలై ప్రాణాలతో బయటపడ్డాడు. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఎవరూ పెళ్లి చేసుకోరని మద్యానికి బానిసై ఏమి పనిచేయకుండా తిరుగుతుండేవాడు. శనివారం రాత్రి మద్యం తాగి వచ్చి ఇంట్లో ఉరేసుకున్నాడు. తల్లి ఉమ తెల్లారి చూసేసరికి చీరతో దూలానికి అనుదీప్ ఉరేసుకుని చనిపోయి ఉన్నాడు. తల్లి ఉమ ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

తాంసి: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై ముంతాజ్ తెలిపారు. ఏఎస్సై కథనం ప్రకారం.. భీంపూర్ మండలం బుర్కపల్లి గ్రామానికి చెందిన కుడ్మేత రాంచందర్ (35) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో శనివారం వరుసకు సోదరుడైన వ్యక్తి ఇంటికి అతని లేని సమయంలో వెళ్లాడు. దీంతో వరుసకు సోదరుడు మందలించడంతో రాంచందర్ అవమానంగా భావించాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రాత్రి వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం మధ్యాహ్నం గుబిడిపల్లి శివారులో పురుగులమందు తాగి విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై ముంతాజ్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి భార్య మమత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.


అనుదీప్ (ఫైల్)

ఆస్తి తగాదాలతోనే కొడుకుపై కత్తిదాడి

నార్నూర్: మండలంలోని గుంజాల గ్రామంలో శనివారం రాత్రి కొడుకుపై తండ్రి కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆస్తి తగాదాలతోనే కొడుకుపై తండ్రి కత్తితో దాడి చేసినట్లు సీఐ రహీం పాషా తెలిపారు. ఆయన క థనం ప్రకారం..గ్రామానికి చెందిన మెస్రం భుజంగరావుకు ముగ్గురు కొడుకులు ఉన్నా రు. నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. పెద్ద కొడుకు బాలాజీకి రంధాబాయితో పెళ్లయింది. వీరికి రెండు నెలల కుమారుడు ఉన్నాడు. ఆస్తిలో వాటా కావాలని కొన్నిరోజులుగా తండ్రి కొడుకుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికొచ్చిన తండ్రితో బాలాజీ గొడవపడ్డాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న తండ్రి ఆవేశానికి లోనై బాలాజీ కడుపులో కత్తితో పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆదిలాబాద్ రిమ్స్‌లో బాలాజీ చికిత్స పొందుతున్నాడు. తండ్రి పరారీలో ఉన్నాడు. బాధితుడి భార్య ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భయం గుప్పిట్లో గ్రామాలు

- నాగాపూర్, చాందూర్ గ్రామాల్లో పెద్దపులి సంచారం
- ఎద్దుపై దాడితో భయాందోళనలో గ్రామస్తులు


నాగాపూర్ శివారులో గుర్తించిన పులి పాదముద్రలు


పులి సంచారంతో జామ్‌డా సమీపంలో గుమిగూడిన గిరిజనులు

ఉట్నూర్‌రూరల్/నార్నూర్: నిర్మల్ జిల్లాకేంద్రం నుంచి సంచరిస్తూ వస్తున్న పెద్దపులి శుక్రవారం పెంబి మండలంలో గేదె, దూడపై దాడి చేసింది. శనివారం పెంబి దోందరి, చిసిచెల్మ రేంజ్ పరిధిలోని వంకతుమ్మ ప్రాంతంలో ఎద్దుపై దాడి చేసి గాయపర్చింది. అక్కడి నుంచి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం నాగాపూర్‌లో ఆదివారం కనిపించింది. ఉదయం వాకింగ్‌కు వెళ్లిన యువకులు పులిని గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడికి చేరుకుని నీటి కాల్వలో పులి పాదముద్రలు గుర్తించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. మధ్యాహ్నం చాందూర్ సమీపంలో రాజుల్‌గూడకు చెందిన కుమ్ర ఆనంద్‌కు చెందిన ఎద్దుపై దాడి చేసి గాయపర్చిందని స్థానికులు పేర్కొన్నారు. డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఉట్నూర్ ఎఫ్ఆర్వో శిలానంద్.. నాగాపూర్, చాందూర్ గ్రామాలను సందర్శించారు. పాదముద్రలను గుర్తించి పులిగా నిర్ధారించారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. చుట్టుపక్కల గ్రామస్తులను అప్రమత్తం చేశారు. రెండు రోజులపాటు పంట పొలాలకు, బయటికి వెళ్లొద్దన్నారు. పొలాల వద్ద విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయొద్దన్నారు. ప్రస్తుతం పులి..నాగాపూర్, చాందూరి మీదుగా నార్నూర్ మండలం జామడ వైపుగా వెళ్లిందని అధికారులు నిర్ధారించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నార్నూర్, జైనూర్ మండలాల మీదుగా జోడేఘాట్ అడవులకు వెళ్లనుందని, అక్కడ ఆడపులి సంచరిస్తుందని అధికారులు పేర్కొన్నారు. పులి సంచారంతో గిరిజన గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

పులి సంచారంతో గ్రామస్తుల ఆందోళన

ఉట్నూర్, నార్నూర్ ప్రాంతంలో పులి సంచారంతో మండలంలోని జామ్‌డా, తాడిహత్నూర్, గుంజాల, నాగల్‌కొండ, పట్నాపూర్, మహగావ్, చోర్గావ్ గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎఫ్ఎస్‌వో సుదర్శన్ జాదవ్ తెలిపిన వివరాలు.. ఆదివారం ఉట్నూర్ మండలంలోని నాగాపూర్ వద్ద వాకింగ్ చేస్తున్న కొందరు యువకులకు పులి కనిపించడంతో వారు భయంతో పరుగులు తీశారు. హస్నాపూర్, శంకర్‌నాయక్ తండా మీదుగా మధ్యాహ్నం నార్నూర్ మండలం జామ్‌డా శివారులో పశువులు మేత మేస్తుండగా పులి ఆవుపై దాడి చేసింది. కాపరి కేకలతో అక్కడి నుంచి వెళ్లిపోయిందని గ్రామస్తులు తెలిపారు. డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పులి పాదముద్రలను గుర్తించారు. నార్నూర్ మండలం జామ్‌డా, తాడిహత్నూర్, నాగల్‌కొండ, చోర్గావ్, బాబేఝరి, సుంగాపూర్, మహగావ్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండురోజులపాటు ప్రజలు పత్తి ఏరేందుకు గాని ఇతర వ్యవసాయ పనులకు వెళ్లొద్దని సూచించారు. సోలార్ జట్కా మిషన్, కరెంట్ తీగలను ఎవరూ పెట్టవద్దన్నారు. జామ్‌డా నుంచి కుమురం భీం జిల్లా జైనూర్ మండలం మీదుగా కెరమెరి మండలం జోడేఘాట్ అటవీ ప్రాంతానికి పులి వెళ్లిపోతుందన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


నస్పూర్: సింగరేణిలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వర్‌రావు అన్నారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడారు. కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో ఈనెల 12న లైజర్ సెల్ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. లైజర్ సెల్ ద్వారా ఎస్సీ ఎస్టీ, మైనార్టీ మహిళా కార్మికుల సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందన్నారు. దీని ఏర్పాటుకు సహకరించిన ఎస్సీ ఎస్టీ మిషన్‌కు, సింగరేణి సీఎండీ బలరాం తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ కార్మిక సంఘం ఒకటే ఉందన్నారు. ఎవరు ఎలాంటి ప్రకటనలు చేసినా కార్మికులు అయోమయానికి గురికావొద్దన్నారు. త్వరలో అన్ని ఏరియాల్లో పర్యటించి కార్మికుల సమస్యలు తెలుసుకుంటామన్నారు. సమావేశంలో ఇరావుల శ్రీనివాస్ సెంట్రల్ కమిటీ మెంబర్, దేగల ప్రవీణ్‌కుమార్ వైస్ ప్రెసిడెంట్, నాయకులు అంద వెంకట్, లక్ష్మణ్, వేల్పుల ప్రవీణ్, వాసు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

మహారాష్ట్రలో ఏపీ డిప్యూటీ సీఎం ప్రచారం

ఆసిఫాబాద్: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా బల్లార్షా బీజేపీ అభ్యర్థి సుధీర్ మునిగంటివార్ తరఫున ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. బల్లార్షాలో తెలుగు ఓటర్లు ఉండడంతో ఇక్కడి నాయకులు పాల్గొన్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, పార్టీ రాష్ట్ర నాయకులు బోనగిరి సతీశ్‌బాబు, బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎలగతి సుచిత్, శ్రావణ్‌గౌడ్, ఇగురపు సంజీవ్, జిల్లా నాయకులు ఉన్నారు.


ప్రచారంలో పవన్‌కల్యాణ్‌తో నాయకులు

గిరిజనుడిని చితకబాదిన అధికారులు


గిరిజన సంఘం నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రవీందర్

- రామలక్ష్మణుల గుట్ట వద్ద ఘటన
- పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదు

వేమనపల్లి: గిరిజనుడిని అటవీ అధికారులు చితకబాదిన ఘటన మండలంలోని సుంపుటం అటవీ ప్రాంతంలోని రామలక్ష్మణుల గుట్ట వద్ద చోటుచేసుకుంది. బాధితుడు, కళ్లెంపల్లి గ్రామానికి చెందిన గిరిజనుడు కుస్రం రవీందర్ తెలిపిన వివరాలు.. ఈనెల 15న తన బావ ఆత్రం బక్కయ్యతో కలిసి రామలక్ష్మణుల గుట్ట వద్దకు చీపురు సేకరణ కోసం వెళ్లాను. అక్కడే ఉన్న తిరుమాను చెట్లకు లక్క ఉండటంతో చెట్టును నరికి సేకరించారు. సమాచారం అందుకున్న ఎఫ్ఎస్ఓ బేగ్, వేమనపల్లి ఎఫ్‌బీవో సోఫియాబేగం భర్త పాషా అక్కడికి వెళ్లారు. అధికారులను చూసి బక్కయ్య పరుగెత్తగా రవీందర్‌ను అదుపులోకి తీసుకుని కొట్టారు. బైక్‌పై కుశ్నపల్లి అటవీ కార్యాలయానికి తరలించి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని బాధితుడు తెలిపాడు. ఆదివారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం, మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేశంలతో కలిసి నీల్వాయి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


అధికారుల దాడిలో గాయపడిన రవీందర్

ఎలాంటి దాడి చేయలేదు

కళ్లంపల్లి గ్రామస్తులు గతేడాదిగా లక్క సేకరణ కోసం చెట్లను నరుకుతున్నారు. 15న అటవీ ప్రాంతానికి వెళ్లిన తమను చూసి అందరూ పరారయ్యారు. రవీందర్ పరుగెత్తగా కిందపడగా గాయాలయ్యాయి. అతడిపై దాడికి చేయలేదు. కేసు పెడతారనే నెపంతో దాడి చేసినట్లు వారు ఆరోపణ చేస్తున్నారు. కాగా, వేమనపల్లిలో తాను అద్దెకు ఉంటున్న ఇంటి వద్దకు వచ్చి కళ్లంపల్లి గ్రామస్తులు దాడికి యత్నించారని ఎఫ్‌బీఓ సోఫియాబేగం డీఆర్‌వో రూపేష్, భర్త పాషాతో కలిసి నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. – బేగ్, ఎఫ్ఎస్ఓ